




సంచలన సాయంకాల పత్రిక


# సత్యం

https://www.satyamdaily.net/

సోమవారం 2-12-2024

సంపుటి: 20 సంచిక: 211


పేజీలు: 4 వెల: రూ.1


# వలపు వల

## అటవీశాఖకు మరో మరక

- ఎయిర్‌పోర్టు పోలీసుల అదుపులో ఫారెస్టర్
- జాయ్ జమీమాతో కలిసి బ్లాక్‌మెయిలింగ్
- మూడేళ్ల పాటు కనబడకుండాపోయిన వేణుభాస్కర్‌రెడ్డి
- 2022లో సొమ్ములు మింగి సర్వీస్ ఇచ్చేసిన సిబ్బంది




FIRST INFORMATION REPORT



నేరుగా ఐఎఫ్ఎస్ అధికారి ఇక్కడ డీఎఫ్‌వోగా పని చేసినా రెండు నెలల్లో చెడగొట్టేయడం మన అటవీశాఖలో ఉన్న ఉద్యోగులకు వెన్నతో పెట్టిన విద్య. అటువంటిది టెంపరరీగా ఆ సీటులో కూర్చున్న అధికారిని వదుల్తారా? డిపార్ట్‌మెంట్‌లో సెక్షన్ ఆఫీసర్/ ఫారెస్టర్‌గా పని చేసిన ఓ ఉద్యోగి చెప్పా పెట్టకుండా మూడేళ్ల పాటు కనపడకుండాపోయారు. 2022లో ఓ మంచి ముహూర్తాన ప్రత్యక్షం కాగానే ఏమైపోయావ్, ఎందుకు డుమ్మా కొట్టావ్ అని అడగకుండా ఆయన ఇచ్చిన నోట్లకట్టలను తీసుకొని సర్వీసును, బెనిఫిట్స్‌ను ఇచ్చేసిన చరిత్ర మన అటవీశాఖ ఉద్యోగులది. అయితే ఈ ఫారెస్టర్ నుంచి తీసుకున్న లంచం ఒక మహిళను అడ్డుపెట్టుకొని వలపు వల విసరడం ద్వారా సంపాదించినదని తేలింది.

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో వలపు వల విసిరి, ఆ తర్వాత అనేకమందిని బ్లాక్‌మెయిల్ చేసి ఆస్తులు సంపాదించుకున్న ముఠాలో కీలక సభ్యుడ్ని శని వారం విశాఖపట్నం పోలీసులు అరెస్టు చేశారు. విచిత్రంగా వలపువల (హనీట్రాప్) విసిరిన మహిళ, ఆమె వెనుక ఉన్న వేణుభాస్కర్‌రెడ్డి ఇద్దరూ శ్రీకాకుళంవాసులే కావడం కొసమెరుపు. జిల్లాలో మొదలుపెట్టి హైదరాబాద్ వరకు వీరి ముఠా అనేకమందిని తమ వలలో చిక్కుకునేలా చేసి, ఆ తర్వాత కోట్లాది రూపాయలు కొల్లగొట్టే శారు. శ్రీకాకుళానికి చెందిన ధనుకులు, వ్యాపార వేత్తలు, వివాహమైనవారితో ప్రేమాయణం నడిపి, ఆ తర్వాత ఆ ఫొటోలు, వీడియోలు లీక్ చేయ కుండా ఉండటం కోసం లక్షలాది రూపాయలు గుంజి ఎంతోమందిని రోడ్డుపాలు చేసిన కొరపాలు జాయ్ జమీమాది శ్రీకాకుళం. ఇక్కడ ఎంతోమంది ని వలపు వలలో దించి సొమ్ములు గుంజేసిన తర్వాత విశాఖ పట్నం కేంద్రం గా తెలుగు రాష్ట్రాల్లో మోసాలకు తెరలేపింది. ఈమెకు సహకరించింది, ఈ ముఠాను విశాఖ పట్నంలో లీడ్ చేసింది శ్రీకాకుళం జిల్లా అటవీ శాఖలో వజ్రపుకొత్తూరు ఫారెస్టర్‌గా పని చేస్తున్న బి.వేణుభాస్కర్‌రెడ్డి. వేణు 2019లో జిల్లా నుంచి మాయమయ్యారు. ఫారెస్టర్‌గా పని చేస్తున్న వేణు కనీసం సెలవు చీటీ కూడా ఇవ్వకుండా మాయమై పోయాడు. తన కొడుకు కనిపించడంలేదని ఆయన తల్లి జిల్లా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆతర్వాత ఎంతకాలానికీ ఆయన ఆచూకీ దొరక్కపోవడంతో ఆయన దొరకలేదంటూ గెజిట్ నోటిఫికేషన్ కూడా ఇచ్చారు. అవన్నీ ఏమయ్యాయో తేల్చకుండానే ఫారెస్ట్ అధికారులు 2022లో అక స్మాత్తుగా ప్రత్యక్షమైన వేణుభాస్కర్‌రెడ్డికి మళ్లీ ఉద్యోగమిచ్చేశారు. మూడేళ్లపాటు తన మానసిక - మిగతా 4లో

సైన్స్ ఫిక్షన్ సినిమాల్లో చూపించినట్లు ప్రపంచంలో ఉన్న ఉద్యోగాలన్నీ ఊడ్చుకుపోయేంత శక్తివంతమైనది కాదు. కృత్రిమ మేధ మానవాళిని బానిసలుగా చేసేదో, వినాశనం కావించేదో కాదు. అది ఎప్పటికీ సాధ్యపడేది కాదు. కృత్రిమ మేధ సాధనాలను శల్యపరీక్షలకు గురిచెయ్యకుండా, సరైన పర్యవేక్షణ లేకుండా వినియోగించడం మాత్రం ప్రజలను నష్టాలకు గురి చేస్తుంది. న్యాయబద్ధమైన వారి హక్కులు, సదుపాయాలకు భంగం వాటిల్లుతుంది.

- మానవ మేధస్సుకు ఏమాత్రం సరిపోదు
- ఉద్యోగాలు పోతాయనడం ప్రచారం మాత్రమే




# ఎ.ఐ. పరమాద్భుతం ఏమీ కాదు..

రోబోట్లు మహా అయితే ఆటోమొబైల్ పరిశ్రమల్లో ఏకరీతిగా ఉండే 'అసెంబ్లింగ్' పనులు చేపట్టడానికి ఉపయోగపడతాయి. డ్రైవర్ రహిత కార్ల గురించి ఎంతకాలం నుంచి ఊదరగొడుతున్నారు! ఎన్నెన్ని నిధులు ఖర్చు చేస్తున్నారు! కానీ పూర్తిగా యంత్రం మీద ఆధారపడి వాహనం నడపడం అనేది సమీప భవిష్యత్తులో సాధ్యపడేలా లేదు. అందరూ ఊహించినట్లు కృత్రిమ మేధ ద్వారా శారీరక శ్రమ చేసే 'బ్లూ కాలర్' ఉద్యోగాలకు నష్టం వాటిల్లడానికి బదులు మేధోశ్రమ చేసే భాషా అనువాదకులు, ఉపన్యాసాలను అక్షరీకరించే పనులు, కాల్‌సెంటర్ ఉద్యోగాలు బలవుతున్నాయి. కృత్రిమ మేధ మహా చెడ్డదనో, పనికిమాలినదనో చెప్పడం నా ఉద్దేశ్యం కాదు. ఆ సాధనాలకు ఉన్న పరిమితులను గుర్తెరిగి సహాయకంగా వాడుకుంటే తప్పనిసరిగా ప్రయోజనాలు సమకూరుతాయి. అయితే కృత్రిమ మేధ పరిశ్రమ, ఆ సాధనాల చుట్టూ శృతిమించి అల్లుతున్న మీడియా ప్రచారం మాత్రం స్వార్థ ప్రయోజనాల రీత్యా చేపట్టినదే. కృత్రిమ మేధ మానవాళి సమస్యలను పరిష్కరించే పరమాద్భుతం ఏమీ కాదు.


**- బప్పా సిన్హా**
'ఫ్రీ సాఫ్ట్‌వేర్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా' సభ్యుడు


కృత్రిమ మేధ చుట్టూ నిరంతరాయంగా మీడియా సృష్టిస్తున్న ప్రచారపటాటోపం మూలంగా ఈ నూతన సాంకేతిక విప్లవంతో గతంలో ఎన్నడూ లేనంతగా మన జీవితాలు మారిపోనున్నాయనే అభిప్రాయం జనాల్లో పాదుకుంటున్నది. మనుషులకు ఉండేంత మేధస్సు గల ఈ యంత్రాలు మనుషులు చెయ్యగలిగిన పనులన్నీ చేసేస్తూ వివిధ రకాల ఉపాధి అవకాశాలను కొల్లగొట్టేసి మనల్ని పనికిమాలిన వాళ్లుగా మార్చేస్తాయన్న సాధారణ అభిప్రాయం జనంలో ప్రబలిపోయింది. కృత్రిమ మేధతో కూడిన ఆటోమేషన్ (యాంత్రీకరణ) ద్వారా లక్షలాది ఫ్యాక్టరీ ఉద్యోగాలు పోతాయని, అలాగే జర్నలిస్టులు, రచయితలు, ఉపాధ్యాయులు, సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామర్లు, డాక్టర్లు వంటి వృత్తి నిపుణుల అవసరం లేకుండా పోతుందని ఇప్పటికే టన్నుల కొద్దీ వ్యాసాలు వచ్చాయి. కృత్రిమ మేధ సాధనాలు అద్భుతాలే కావచ్చుగాక, కానీ అవి నిజంగానే అంత తెలివైనవా? చాట్ జి.పి.టి నిజంగానే మనం వేసిన ప్రశ్నలను అర్థం చేసుకుని, మనం లేవనెత్తిన అంశాలను అవలోకించిస్పందిస్తుందా? కళాకారులు తమ సృజనాత్మక శక్తితో రూపొందించే చిత్రాలు, రాసే కవిత్వం సృష్టించేటపుడు మనిషిలా ఆలోచిస్తాయా? కృత్రిమ మేధ సృష్టికర్తల సహా చాలామంది ఇప్పటికే ఇవి మానవ మేధస్సు వంటి లక్షణాలు కలిగి ఉన్నాయని ప్రకటించేశారు. కృత్రిమ మేధస్సు సాధనాలు మానవ మేధస్సుతో సమానంగా గానీ, దాన్ని దాటిపోయి ఏకైక అత్యుత్తమ సాధనాలుగా మారడానికి ఎంతోకాలం పట్టదన్న వాదన కూడా చేస్తున్నారు. ఈ వాదనలకు మనం మోసపోవాల్సిన అవసరం లేదు. వాస్తవానికి ఈ కృత్రిమ మేధ సాధనాలు మానవ మేధస్సుకు దరిదాపుల్లో లేవు. ప్రస్తుతం వీటిపై కొనసాగుతున్న పరిశోధనలు సమీప భవిష్యత్తులో మానవ మేధస్సుతో సరితూగగల వ్యవస్థను సృష్టించ లేవు. అవి రూపొందించే పాఠాలు, సందేశాలు, చిత్రాలు, ఆఖరికి 'కోడ్'లను కూడా అర్థం చేసుకునే పరిజ్ఞానం కానీ, వాటి మీద పట్టుగానీ ఈ సాధనాలకు ఉండవు. కృత్రిమ మేధ ప్రధానంగా ఇప్పటికే ఇంటర్నెట్‌లో అందుబాటులో ఉన్న సమాచారం, చిత్రాల మీద ఆధారపడి పని చేస్తుంది. అందుబాటులో ఉన్న సమాచారానికి సంబంధించిన గణాంక ధోరణుల సాయంతో ఏ పదం తర్వాత ఏ పదం, ఏ విభక్తి తర్వాత ఏ వాక్యం రావాలో గ్రహిస్తుంది. అవి రూపొందించే వాక్యాలు, చిత్రాలు, పాఠాలు అన్నీ ఈ గణాంక ధోరణుల ఆధారంగా కలగాపులగం చేసి కొత్తగా మనకు అందివ్వడంతో ఈ సాధనాలకు ఆయా విషయాల మీద చాలా పట్టుందని భ్రమపడతాం. అంటే ఈ సాధనాలు పనికిమాలినవనో, గొప్ప ఆవిష్కరణలు కాదనో చెప్పడం నా ఉద్దేశ్యం కాదు. మన పనిలో ఇవి చాలా గొప్పగా ఉపకరిస్తాయి. కాకపోతే వాటి మేధస్సు మీద అతిగా ఆధారపడితే అది పొరపాటు ధోరణులకు దారితీస్తుంది. ఒక్కోసారి వినాశకర ఫలితాలు దాపురిస్తాయి.

ఉదాహరణకు మన సెల్‌ఫోన్లలో 'ఆటో కలెక్ట్', 'ఆటో కంప్లీట్ అన్న ఫీచర్లు ఉంటాయి. మనం ఏదన్నా టైప్ చెయడానికి పూర్తిగా వాటి మీదే ఆధారపడితే అది ఇచ్చే సలహాలు పొరబాటు అర్థాలకు దారితీసే అవకాశం ఉంటుంది. కాబట్టి స్వయంగా మనం దానిని సరిచూసుకోవాల్సి ఉంటుంది. తప్పులు సరిదిద్దుకోవాల్సిన అవసరం ఉంటుంది. మనం ఈ ఫీచర్లను వాడుతున్నంత మాత్రాన అవి 'తెలివైనవి' అనుకోగలమా. కృత్రిమ మేధ సాధనాలన్నీ ఈ ప్రాతిపదికన అభివృద్ధి చేసినవే. మనం రూపొందించిన వ్యాసాలలో పదబంధాలలో మార్పులు, సంక్లిష్టంగా ఉన్న వాక్యాలను సాధారణీకరించడం సంక్షిప్తం చెయ్యడం వంటి పనులకు చాట్ జి.పి.టి ఉపయోగపడుతుంది. అంతే తప్ప సాధికారిక సమాధానాలు ఇచ్చే శక్తి వాటికి ఉండదు. మానవ మేధస్సుతో సృజించే రచనలకు ఎంత మాత్రం సరిసాటి కావు. అలాగే కోడ్ రాయడానికి అందుబాటులో ఉన్న కోపైలట్ వంటి వాటికి కూడా పరిమితులు ఉన్నాయి. ఇది రూపొందించిన కోడ్‌ను సమీక్షించకుండా ఎవరూ ఏ కోడ్‌నూ వినియోగంలోకి తీసుకురాలేరు. ఇవాళా రేపు కార్పొరేట్ వ్యాపార వాణిజ్య సంస్థలు మానవ వనరుల మీద చేసే ఖర్చు ఎప్పటికప్పుడు తగ్గించుకోవాలనే సంస్కృతికి అలవాటు పడ్డాయి. ఇందులో భాగంగానే అవకాశం ఉన్న ప్రతి చోటా ఉద్యోగులను తొలగించి ఈ సాధనాలను వినియోగిస్తున్నాయి. అయితే వీటి మీద సరైన పర్యవేక్షణ లేని మూలంగా పొరపాట్లు దొర్లే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అలాగే ఈ కృత్రిమ సాధనాలను వినియోగించి తప్పుడు సమాచారం సృష్టించడం, డీప్-ఫేక్ వీడియోలు తయారు చేయడం వంటి హానికర ధోరణులకు పాల్పడే అవకాశాలు ఉన్నాయి. కాబట్టి వీటి పట్ల తగు జాగ్రత్త వహించాలి. కృత్రిమ మేధ ద్వారా సృష్టించే కళలు, సాహిత్యం, సినిమాల పట్ల నైతిక విలువల ఆందోళనలూ ఉన్నాయి. కృత్రిమ మేధ సాధనాల ద్వారా ఒక కళాకారుడి సృజనాత్మక కళా సృష్టి ధోరణులను ఆధారంగా చేసుకుని చిత్రాలు రూపొందించవచ్చు. కానీ ఇది మేధో చౌర్యం కిందకు వస్తుంది. ఇప్పటి వరకు మనం చర్చించిన కృత్రిమ మేధ ప్రోగ్రామ్‌లన్నీ జనరేటివ్ ఎ.ఐ కోవలోకి వస్తాయి. అమెరికాలో ఎ.ఐ ఆధారంగా చేసిన నిర్ణయాల మూలంగా ఆ దేశంలోని మైనార్టీలు దీర్ఘకాలం కారాగార శిక్షలు అనుభవిస్తున్న వైనం బట్టబయలయింది. పిల్లలకు సరైన పోషకాహారం అందించడం లేదనే తప్పుడు సమాచారం ఆధారంగా అనేక మంది తల్లిదండ్రులకు వారి బిడ్డల మీద ఉండే హక్కులకు దూరం చేశారు. ప్రజలకు వైద్య సదుపాయాలు అందకుండా పోయిన సందర్భాలూ ఉన్నాయి. ఈ కృత్రిమ మేధ సాధనాలకు నిర్ణయాలు తీసుకునేందుకు అనువుగా అందుబాటులో ఉంచిన సమాచారం శాస్త్రీయంగా నియంత్రించినది కాకపోవడమే ఇందుకు కారణం. ఈ సాధనాలు చేసే నిర్ణయాలకు ఉన్న ప్రాతిపదికలను బహిరంగంగా వెల్లడించడం లేదు. అందుకే ఇవి చేసే నిర్ణయాలు ఏకపక్షంగా, పారదర్శక లేమితో ఉంటున్నాయి. పౌరుల, ఖాతాదారుల న్యాయమైన హక్కులను నిరాకరించడానికి ప్రభుత్వాలు, ప్రైవేటు కార్పొరేట్ సంస్థలూ ఈ సాధనాలను వాడుతున్నాయనేది బహిరంగ రహస్యమే. ఈ కృత్రిమ మేధ రూపొందించిన ఆల్గరిథమ్ మీద ఆధారపడి సామాజిక మాధ్యమాల్లో ఏ అంశాన్ని ప్రముఖంగా చలామణి చెయ్యాలో నిర్ణయిస్తున్నారు. అలాగే అభ్యంతరకర చిత్రాలు, పోస్టులను తొలగించడానికి వీటి సహకారం తీసుకుంటున్నారు. కానీ వాస్తవానికి అసంబద్ధ, విద్వేషపూరిత సమాచారాన్ని కనుగొని నిలవరించడంలో ఈ ఆల్గరిథమ్ విఫలమయ్యిందని ఈ మధ్యకాలంలో స్పష్టంగా తెలిసివచ్చింది. ప్రభుత్వాలకు నొప్పి కలిగించే రాజకీయ అంశాలను తొక్కిపెడుతు న్నాయి. ఇది 'కంటెంట్ మోడరేషన్' పేరిట సెన్సార్‌కి పాల్పడడమే. సామాజిక మాధ్యమాల్లో 'ఫేక్ న్యూస్' (తప్పుడు సమాచారం) ఎంతటి ఉత్పాతం సృష్టిస్తుందో మనం నిత్యం చూస్తున్నాం. మరైతే కృత్రిమ మేధతో తయారైన మరమనుషులు-రోబోట్లు పారిశ్రామిక కార్మికులకు ఉద్వాసన పలకడం లేదా? వాస్తవిక ప్రపంచంలో మానవులు చేసే భౌతిక శ్రమ సంక్లిష్టంగా, బహుముఖంగా, ఓ క్రమపద్ధతి లేకుండా, ఊహింపనలవి కాని పరిస్థితులలో కూడా కొనసాగుతుంది. ఇది కేవలం అధ్యయనం ద్వారా సమకూరదు. సాధన కావాలి.

• ఎడిటోరియల్

# ఏపీలో 'సోషల్' వివాదం

ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల సోషల్ మీడియా పోస్టుల చుట్టూ రాజకీయ వివాదం నడుస్తోంది. వైకాపా కార్యకర్తలతో పాటు రామ్ గోపాల్ వర్మ, పోసాని కృష్ణ మురళి వంటి వారిపై కేసులు నమోదయ్యాయి. వైకాపాకు చెందిన వర్రా రవీందర్ రెడ్డిని ఇప్పటికే అరెస్టు చేశారు. చంద్రబాబు నాయుడు, వైఎస్ షర్మిల, వైఎస్ సునీతారెడ్డి, పవన్ కల్యాణ్ కుటుంబసభ్యులపై 'అసభ్యకర భాష'లో సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారనేది వర్రా రవీందర్ రెడ్డి మీద ఉన్న ఆరోపణ. గతంలో వైకాపా సోషల్ మీడియా విభాగం కన్వీనర్‌గా ఉన్న సజ్జల భార్గవరెడ్డి మీద కేసులు పెట్టారు. సినిమా డైరెక్టర్ రామ్ గోపాల్ వర్మ మీద కేసు నమోదు అయింది. ఆయనకు పోలీసులు నోటీసులు ఇచ్చారు. శ్రీరెడ్డి మీద కూడా కేసులు నమోదయ్యాయి. సుమారు 680 మందికి నోటీసులు ఇవ్వగా, 147 మంది మీద కేసులు నమోదు చేశారని, 50 మందిని అరెస్టు చేశారని వైకాపా నేతలు ఆరోపిస్తున్నారు. కానీ,అధికారికంగా పోలీసులు ఇంకా ఎటువంటి వివరాలూ చెప్పలేదు. వైకాపా హయాంలోనూ సోషల్ మీడియా పోస్టులకు సంబంధించి టీడీపీ కార్యకర్తలు, ఆ పార్టీ సానుభూతిపరుల మీద కేసులు నమోదయ్యాయి. 2020లో విశాఖలోని ఎల్‌జీ పాలిమర్స్‌లో జరిగిన అగ్ని ప్రమాదంపై ప్రభుత్వ స్పందనను తప్పుబడుతూ ఫేస్‌బుక్‌లో వచ్చిన పోస్టును ఫార్వార్డ్ చేసినందుకు టీడీపీ సానుభూతిపరురాలు, గుంటూరుకు చెందిన రంగనాయకమ్మ మీద కేసు పెట్టారు. 2020లో కరోనా సమయంలో నాటి ఎంపీ విజయసాయిరెడ్డి, మంత్రి అవంతి శ్రీనివాస్‌లపై అనుచిత వ్యాఖ్యలతో వచ్చిన వార్తా కథనాన్ని ఫార్వార్డ్ చేశారంటూ విశాఖకు చెందిన టీడీపీ సానుభూతిపరుడు నలందకిశోర్‌ను సీఐడీ పోలీసులు అరెస్టు చేశారు. 2023లో నాటి సీఎం వైఎస్ జగన్ ఫోటోను మార్ఫింగ్ చేసి కించపరిచారంటూ గుంటూరుకి చెందిన టీడీపీ మహిళా కార్యదర్శి పిడికిటి శివ పార్వతిని పోలీసులు అరెస్టు చేశారు. ఇప్పుడు అరెస్టులపై వైకాపా, టీడీపీ నేతలు పరస్పర ఆరోపణలు చేసుకుంటున్నారు. అసభ్యకర పోస్టులు పెట్టేది మీ వాళ్లంటే మీ వాళ్లు అని నిందలు వేసుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 30ఏళ్ల కిందటే రాజకీయాల్లో వ్యక్తిత్వాలను కించపరిచేలా మాట్లాడటం మొదలైంది. కొందరు రాజకీయ నేతలు తమ అనుకూల పత్రికల ద్వారా ఇతర నేతల వ్యక్తిత్వ హననానికి పాల్పడేవారు. తమ వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలను తప్పుదోవ పట్టించడానికి ప్రధాన మీడియా సంస్థల పత్రికలు, టీవీ చానెళ్లను వాడుకుంటున్న తరుణంలో సోషల్ మీడియా వచ్చింది. సోషల్ మీడియా వినియోగం బాగా పెరిగిన తర్వాత మెల్లగా రాజకీయ నేతలు వాటిని వేదికగా చేసుకోవడం మొదలుపెట్టారు. ఇతరులను లక్ష్యంగా చేసుకుంటూ సోషల్ మీడియాను ఆయుధంగా వాడటం మొదలుపెట్టారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇది రానురాను మరింత దిగజారుతూ వచ్చింది. చివరకు ప్రజలు గౌరవప్రదంగా జీవించే హక్కును సోషల్ మీడియా కాలరాసే పరిస్థితి తెచ్చింది. ఇందుకు అన్ని రాజకీయ పార్టీలు కారణం. ఇటీవలి కాలంలో రాజకీయ పార్టీలు సంస్థాగత కమిటీల కంటే సోషల్ మీడియా సైన్యానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాయి. పార్టీకి బలమైన పునాదిగా భావిస్తూ ఆయా రాజకీయ పార్టీలు పెద్ద ఎత్తున సోషల్ మీడియా బృందాలను సమకూర్చుకుంటున్నాయి. అందుకు భారీగా ఖర్చు చేస్తున్నాయి. తమ పార్టీ సిద్ధాంతాలను, భావజాలాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లడం అనే దశను దాటి ప్రత్యర్థుల వ్యక్తిగత సంబంధాల మీద, ఇంట్లో వాళ్లపై జుగుప్సాకరంగా మాట్లాడే స్థితికి ఇవాళ ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి దిగజారింది. ఏపీలో రాజకీయ యుద్ధాలు బయట కంటే సోషల్ మీడియాలోనే ఎక్కువ జరుగుతున్నాయి. సోషల్ మీడియా ఖాతాల్లో ప్రధాన రాజకీయ పార్టీల అభిమానులు ముసుగు ముఖాలు వేసుకుని తమ పార్టీల తరఫున చెలరేగిపోతున్నారు. అసత్య ప్రచారాలు హద్దులు దాటేసి మార్ఫింగ్ ఫోటోలు, వీడియోల స్థాయికి ఎదిగాయి. రాజకీయ విమర్శల పేరుతో మహిళలను కించపరచడం, దూషించడం యథేచ్ఛగా సాగిపోతోంది. ప్రత్యర్థి పార్టీలను విమర్శించే క్రమంలో వారి మానసిక స్థైర్యాన్ని దెబ్బతీయడానికి నేతల కుటుంబాలను, మహిళలను టార్గెట్ చేయడం అలవాటైపోయింది. సోషల్ మీడియా దుష్టశక్తులను ఏరి వేయడం సామాజిక బాధ్యత. సోషల్ మీడియా యాక్టివిస్టులు ఇప్పటికైనా జాగ్రత్తగా ఉండాలి. తప్పుడు ప్రచారాలకు పాల్పడితే ఏదో చిన్న కేసుతో పోదని జీవితాంతం ఇబ్బంది పడాల్సి వస్తుందని గుర్తుంచుకోవాలి. చిన్నపిల్లలను ఇబ్బందికి గురి చేసినట్టుగా పోస్టులు ఉంటే పోక్సో చట్టం సెక్షన్ 57–బీ కింద, బాధితులు దళితులు, గిరిజనులైతే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేస్తారు. సోషల్ మీడియా పోస్టులను ఎవిడెన్స్‌గా పరిగణిస్తారు. ఒకవేళ పోస్ట్ పెట్టి వెంటనే డిలీట్ చేసినా అది కూడా రికార్డ్ అయి ఉంటుంది.

## మరణాంతరం ప్రతీ ఒక్కరూ నేత్రదానం చేయాలి

(సత్యంన్యూస్, రాజాం)

లచ్చయ్యపేటకు చెందిన అల్లాడ సత్యారావు గారి మరణాంతరం నేత్రదానం చేసినందుకు గాను వారి కుటుంబ సభ్యులు భార్య జగదీశ్వరి కుమారులు సాయి, ప్రకాష్, కుటుంబసభ్యులను అభినందిస్తూ రెడ్‌క్రాస్ తరపున ప్రశంసాపత్రాన్ని అందచేశారు. ప్రతీ ఒక్కరూ మరణాంతరం నేత్రదానానికి ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో రాజాం రెడ్ క్రాస్ చైర్మన్ కొత్తా సాయి ప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్య కుమార్, బూరాడ శివకృష్ణ, బింగి రంగనాధం మాష్టర్, కోటీశ్వరి, శ్రీను, తవిటిరాజు, విట్టు తదితరులు పాల్గొన్నారు.



## నైపుణ్యం గల చెస్ క్రీడాకారులుగా ఎదగండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

క్రమం తప్పకుండా చదరంగం క్రీడను ప్రాక్టీస్ చేస్తూ నైపుణ్యం గల క్రీడాకారులుగా ఎదగాలని, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఏసీబీ సీఐ కె. భాస్కర్ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఇలిసిపురం ప్రాంతంలో గల తిలక్ నగర్ నర్సెస్ కాలనీలోని స్కూల్ ఆఫ్ చెస్ ఆకాడమీ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంటు ఉత్సాహంగా జరిగింది. జిల్లాలోని వివిధ ప్రాంతాలలోని చెస్ క్రీడాకారులు 5రౌండ్లపాటు జరిగిన చెస్ పోటీలలో ఆసక్తిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా నిర్వహించిన బహుమతుల ప్రధానోత్సవంలో ఏసీబీ సీఐ కె.భాస్కర్ ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు మెడల్స్ మెరిట్ సర్టిఫికెట్లు, బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఫెడే రేటింగ్స్ చెస్ క్రీడాకారులు, స్కూల్ ఆఫ్ చెన్ ఆకాడమీ చెస్ కోచ్‌లు భేరి చిన్నారావు, కె సాయి నిరంజన్ సింగ్, చెన్ అభిమానులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. విజేతలుగా– తంగి సూర్య 5 విజయాలతో విజేతగా నిలవగా 2వ స్థానంలో బలివాడ జయంత్, 3వ స్థానంలో ఎం.కల్యాణ్ చక్రవర్తి, తరువాత స్థానాలలో కె.తనీష్ కార్తికేయ, కొమర యోగేష్, టి.తనయ్ తణి ఉరిటి లిఖిత్ శ్రీహర్ష, ఎస్వీ రాం హర్షిత్, ఎస్.దివ్యేష్, కె.పార్థవి, కె.వి.ఎస్.ఎస్. నిశ్చల్, ఎన్ని దర్శిత్, కె.రోహన్, బి.సన్మిత, ఎం. త్రిలోచన్, ఎన్వి అశ్విన్, ఎన్.జశ్వంత్ ప్రేమ్‌సాయి, అధికంశెట్టి సహస్ర, అధికంశెట్టి రుశ్వాన్, కె.విజయదర్శిత్, కె.నీల్‌రాం మాన్విత్, కాశిన ఈశ్వర్, బి.పూర్ణిత, శౌర్య తంగుడు, బొడ్డావు లోహిత్ యాదవ్, చింతాడ రోషన్, జి.సాయిప్రసాద్, బలివాడ మహన్వి, చింతాడ రియాన్ శౌర్య, బొడ్డాపు ఫణీంద్ర యాదవ్ విజేతలుగా నిలిచారు. అండర్–10 బాలబాలికల్లో– కె.పార్థని, బి.పన్నిత, ఎస్.దివ్యేష్, కె.రోహన్ విజేతలుగా నిలిచారు.



## సిక్కోలు నేవీ డే సెలెబ్రేషన్స్



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సిక్కోలు జిల్లాలో నేవీ డే సెలెబ్రేషన్స్ కుశలపురం దగ్గర ఉన్న సెలెబ్రేషన్స్ ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా మాజీ సైనికుల అధ్యక్షులు పూర్ణచంద్ర రావు కటకం మాట్లాడుతూ సిక్కోలు జిల్లాలో ఇలా జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. భారతదేశంలో నౌకాదళ దినోత్సవం ఆపరేషన్ ట్రైడెంట్ జ్ఞాపకార్థం జరుపుకుంటారన్నారు. ఇది ఇండో–పాకిస్తాన్ యుద్ధంలో (డిసెంబర్ 4, 1971న) కరాచీ నౌకాశ్రయంపై భారత నావికా క్షిపణి పడవలు దాడి చేశాయని, ఆ యుద్ధంలో అమరవీరులందరినీ గౌరవించేలా ఈ నేవీడే జరుపుకుంటారన్నారు. సుమారు ఒక 50 మంది సిక్కోలు నావికా దళ అనుభవజ్ఞులు నేవీలో గోల్డెన్‌డేస్‌ను గుర్తుచేసుకున్నారన్నారు. నేవీ డే సందర్భంగా భారతీయ సాయుధ దళాలలో చేరే విధంగా యువతను ప్రేరేపించే విధంగా సొసైటీని ప్రభావితం చేసే విధంగా మనం సొసైటీలో మెలగాలన్నారు. నౌకాదళ అనుభవజ్ఞులు చాలామంది రెండవ కెరీర్‌లో ఉన్నారు కాబట్టి వారి సౌలభ్యం కోసం తాము డిసెంబర్ 4న నేవీ డే సెలబ్రేషన్స్ చేసుకోవాల్సి ఉన్నా కాస్త ముందు వెనుక చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజర్లు పైడి రామారావు, కరగాన సత్యనారాయణ, సీపాన రమణమూర్తి, పైడి నాగేశ్వరరావు, బమ్మిడి పురుషోత్తం, పైడి తవిటయ్య, గోవిందరాజులు, సనపల అన్నంనాయుడు, పైడి విశ్వేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, పైడి వేణు, పైడి భాస్కరరావు, జి. శ్రీనివాసరావు, ఎం.అప్పలరాజు, గురుగుబెల్లి శ్రీనివాసరావు, రమేష్‌లు పాల్గొన్నారు.

## ఆపదలో ఆదుకోవటం ప్రతీ ఒక్కరి కర్తవ్యం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆపదలో ఉండేవారిని ఆదుకోవటం ప్రతీ ఒక్కరి కర్తవ్యమని, అందులో వుండే ఆత్మసంతృప్తి ఎక్కడా దొరకదని సంఘ సేవకులు బొట్టా సాయికుమార్ పేర్కొన్నారు. స్థానిక ఏడు రోడ్ల కూడలిలో గల ఎన్టీఆర్ ఎంహెచ్‌స్కూల్ 2024–25 విద్యార్థులు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పెద్దపాడుకు చెందిన సేవకులు బొట్టా సాయికుమార్ మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా, వప్పంగి గ్రామంలో నివాసముంటున్న ఒక నిస్సహాయ కుటుంబానికి మూడు నెలలకు సరిపడే నిత్యావసర సరుకులతోపాటు, కొంత నగదుని వారి కుటుంబసభ్యులకు అందించామని ప్రత్యక్ష దైవం, ఆరోగ్యప్రదాత అరసవల్లి శ్రీ సూర్యనారాయణస్వామి పుణ్యక్షేత్ర గోశాలలో రోజువారీ కూలీగా పనిచేస్తున్న గొంటి తాతారావు యాదవ్ మానసికవేదనతో అనారోగ్యానికి గురై, అధిక షుగర్‌తో బాధపడుతూ ఆస్పత్రి పాలయ్యారన్నారు. మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆసుపత్రిలో చేరారని, పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం లక్షల్లో ఖర్చువుతుందని, ఆరోగ్యశ్రీ కూడా వర్తించదన్నారన్నారు. ఇప్పటికే తలకు మించిన అప్పు చేసి ఖర్చు పెట్టారని, అరసవల్లి పుణ్యక్షేత్రంలో గత కొన్ని నెలలుగా రోజువారీ వేతనాలు అందక ఆర్థికంగా ఇబ్బందిపడటంతో కుటుంబ పరిస్థితి దీనంగా మారిందన్నారు. సిక్కోలు టుడే జి.షణ్ముఖరావు ద్వారా విషయాన్ని తెలుసుకున్న పత్రికా ప్రతినిధి, సేవకులు ఉర్లం శివతేజ, ఆర్మీలో విధులు నిర్వహిస్తున్న కొరాడ గణేష్‌యాదవ్‌లు అందించిన సమాచారంతో ఎమెర్జెన్సీ బ్లడ్ సర్వీస్ నంది ఉమా శంకర్ తన వాట్స్ అప్ స్టేటస్ ద్వారా ఈ చిరుసాయాన్నందించిన శ్రీకాకుళం ఎన్టీఆర్ ఎంహెచ్ స్కూల్ 2024–25 పూర్వపు విద్యార్థులు కొల్లి శివకుమార్, అరజంగి తిరుమల రావు, కరణము షణ్ముఖరావుతోపాటు వారి మిత్ర బృందానికి ప్రత్యేక ధన్యవాదాలన్నారు. అలాగే తాతారావు కుటుంబానికి మనసున్న దాతలతో పాటు, దేవాలయ సిబ్బంది కూడా ఆదుకోవాలని, ఆపదెక్కడుంటే అక్కడ ఎమెర్జెన్సీ బ్లడ్ సర్వీస్ ద్వారా సేవలందించటానికి సిద్ధమన్నారు. ఈ కార్యక్రమంలో ఎమెర్జెన్సీ బ్లడ్ సర్వీస్ నంది ఉమా శంకర్, సేవకులు ఉర్లం శివతేజ, విద్యార్థులు కొల్లి శివకుమార్, అరజంగి తిరుమలరావు, కరణము. షణ్ముఖరావు, మిత్రబృందం, తాతారావు కుటుంబసభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.






# వెండితెర జిలుగులు వెనుక



సినిమా రంగం అన్నది ఒక విచిత్రమైన మాయామోహ జలతారు వంటిది. దాని ఆకర్షణ నుండి తప్పించుకోవడం సామాన్యులకు చాలా కష్టం. అందుకే, వేలాది మంది విద్యావంతులు, బీటెక్, యంటెక్, మెడిసిన్, పిహెచ్.డి లు ఇంకా, అనేక రంగాల్లో నిపుణలయిన వారు, తమ తమ కెరీర్లలో, ఉచ్ఛ స్థితిలో ఉన్న వారు, ఈ సినిమా అనే ఆకర్షణలో పడి, ఏళ్ళ తరబడి అవకాశాల కోసం కృష్ణానగర్ వీధుల్లో, కళ్ళల్లో ఆశలు నింపుకుని, ఏ నాటికైనా తామొక ప్రభంజనం సృష్టించగలమనే అపారమైన నమ్మకంతో తిరుగుతుంటారు. నిజానికి వాళ్ళల్లో ఇప్పుడు రాజ్యమేలుతున్న రచయితలు, దర్శకులు, గేయ రచయితల కన్నా ఎంతో ఎక్కువ విద్వత్తు ఉన్నవారు కూడా ఉన్నారు. అయినా, ఎందుకు వారికి అవకాశాలు రావడం లేదు? ఎందుకు వారు ఘోస్ట్ రైటర్స్‌గా, క్లాప్‌బోర్డు పట్టుకునే అసిస్టెంట్ డైరెక్టర్లుగానే మిగిలిపోతున్నారు? ఎందుకంటే, ఈ సినిమా రంగం ఒక దుర్భేద్యమైన కోట వంటిది. ఇందులోకి అంత సులభంగా ప్రవేశం దొరకదు. అనునిత్యం, ఈ కోటను కాపాడుకుంటూ ఉండే శక్తులు ఉన్నాయి. నిన్ను కోట బయటనే నిలబెట్టి, నీతో సేవలు చేయించుకుంటారు తప్ప నీకు ప్రవేశం లభించదు.

# కనిపించని చీకటి కోణాలెన్నో!

ఈ కోటలో కుళ్ళు, కుతంత్రం, స్వార్థం, కీర్తి కండూతి, ముఖ్యంగా కులం, బంధుప్రీతి, నెపొటిజమ్ రాజ్యమేలుతుంటాయి. ఇందులో ఇంకో విచిత్రం ఉంది. లోపల ఉన్న వాళ్ళకు కూడా అనేక నిబంధనలుంటాయి. లోపల ఉన్న వాళ్ళకు కూడా బయటవాళ్ళ సహాయం కావాల్సి ఉంటుంది. ఉదాహరణకు ఒక పాటల రచయితను లోపలికి అనుమతించారనుకోండి. ఆయనకున్న చిన్నపాటి స్వాతంత్ర్యం ఆయన పాటల గది వరకే. అది దాటి, కోటను ఏలుదామని ప్రయత్నిస్తే, కర్కశ పదఘట్టనలో నలిగిపోతారు. ఇది ఒక పాటల రచయిత కులశేఖర్ సంగతే కాదు, తెలుగు సినిమా రంగాన్ని ఒకప్పుడు ఏలిన సావిత్రి, జమున, కాంతారావు, ఈవెన్ అక్కినేని నాగేశ్వరరావు వంటి మహామహులు, రాజబాబు, పద్మనాభం, పీజే శర్మ వంటి కమెడియన్లు తమ పరిధి దాటి సినిమా నిర్మాణ రంగంలోకి ప్రవేశించగానే, వారిని కర్కశంగా తొక్కి



పడేసి, ప్రేక్షకుల ఆరాధ్యదైవాలైన వారిని, అధఃపాతాళానికి తొక్కి పారేసారు. అక్కినేని వంటి వారు తెలివిగా తప్పుకోని, నటనకు మాత్రమే పరిమితమయి, బయటపడగలిగారు. నిజానికి వీరంతా సున్నిత హృదయులు. నటనలో అగ్రస్థానానికి చేరినా, వారికి సినిమా నిర్మాణం గురించి ఓనమాలు తెలియవు. తెలుసని వారనుకుంటారు గానీ, అందులోని వ్యవహారాల గురించి అవగాహన ఉండదు. ఒక సినిమాను నిర్మించాలంటే, 24 క్రాఫ్టుల మీద కొంతైనా అవగాహన ఉండాలి. ముఖ్యంగా ఆర్థిక వ్యవహారాలలో నిక్కచ్చిగా, నిర్మొహమాటంగా, దొంగ లెక్కలు రాసే నైపుణ్యం ఉండాలి. తిమ్మిని బమ్మిని చేసి, కాల్ షీట్లు సంపాదించాలి. నిర్మాణ సమయంలో జరిగే అనేక, తమ తోటి వారే చేసే అనేక ఆర్థిక దోపిడీలను పసిగట్టి, నిరోధించగలిగే, 360 డిగ్రీల కుశాగ్రబుద్ధి ఉండాలి. అవేమీ సినిమా హీరోహీరోయిన్లకు ఉంటాయని అనుకోను. వారికి నటనలోని మెళకువలు తెలుసు గానీ, నిర్మాణంలోని లొసుగులు తెలియవు. అందుకే, అక్కడ ఫెయిలయి, తిరిగి కోలుకోలేక, జీవితాలను నాశనం చేసుకున్నారు. ఈ కోటలోని చక్రవర్తులు, అరే మన సావిత్రే కదా అని జాలి చూపలేదు. ఆమె పతనావస్థకు చేరుకుంటుంటే సలహా ఇవ్వ లేదు, ఆపలేదు. ఒక్కడూ ఆదుకోలేదు. ఇండస్ట్రీ చాలా క్రూర స్వభావం కలది. ఇప్పుడంటే సినిమా నిర్మాణం కొంత సులభం అయింది. సినిమాలు తీయడం వరకు ఓకే గానీ, విడుదలకు నానా కష్టాలు పడుతున్నారు.

ఇదంతా ఎందుకంటే, ఈ మధ్యే మరణించిన కులశేఖర్ వృత్తాంతం, ఈ కోటలోని రాజకీయాలకు సజీవ ఉదాహరణ. ఒక మంచి పాట రాయాలంటే ఎంత మేధస్సును రంగరించాలి. సున్నిత భావాలను పలికించే కవి, నిజంగా కూడా సున్నితహృదయులే అయి ఉండాలి. అటువంటి సున్నితహృదయుడైన కవి, సినిమా నిర్మాణ రంగంలోకి వెళ్ళి ఆ మొసాలన్నీ చేసే వారిని కట్టడి చేసి, వారిని నియంత్రించగల కఠినత్వం, కర్కశత్వం లేక ఫెయిలయ్యాడు.



దుర్మార్గుడైన ఒక్క మేనేజరు చాలు మనను నిండా ముంచడానికి. మనకు అదృష్టం ఉంటేనే మంచి మేనేజర్ దొరుకుతాడు. మేనేజర్లు పది రూపాయలు పెట్టాల్సిన చోట పదివేలు వెచ్చింపచేస్తారు. ప్రతీ పనిలో కమీషన్లు దండుకుంటారు. అదంతా చాలా సహజమేనన్నట్టుగా ఇండస్ట్రీ వాళ్ళు, ఆ భాగోతానికి ఆమోద వేస్తారు.

కమీషన్ విలువ పది రూపాయలైనా సరే పది లక్షలు ఐనా సరే, వాటిని దుర్మార్గుడైన మేనేజర్ వదిలిపెట్టడు. ఒక లేని సమస్యను సృష్టించి, ఆ సమస్య అంచుల వరకు తీసుకెళ్ళి అప్పుడు మనను ఆదుకున్నట్టుగా, పరిష్కారం చూపించి, అందులో తన ప్రయోజనం ఉండేటట్టుగా చూసుకుంటాడు. నువ్వు ఎంత మేధావివి అయినా, పదో తరగతి పాస్ కాని వాళ్ళ ముందు చేతులు జోడించి, పరిష్కారం చూపించమని వేడుకోవాల్సిందే! ఇటువంటి మేనేజర్లు కొత్తగా వచ్చిన నిర్మాతలనే టార్గెట్ చేస్తారు. పెద్ద నిర్మాతల దగ్గర, నిలదొక్కుకున్న వారి దగ్గర వీరి పప్పులు ఉడకవు. అందరూ ఇలా ఉంటారని కాదు. కానీ, చాలామంది ఇటువంటి వారే. నా మొదటి సినిమా పూర్తి కాగానే, నాకు పని చేసిన మేనేజరు స్వంత ఊరికి వెళ్ళి రెండెకరాల పొలం కొనుక్కున్నాడు. హైదరాబాదు నగరంలో వాణిజ్య పన్నుల అధికారిగా ఎన్నో సంవత్సరాలు పని చేసిన నాకే టోకరా పెట్టాడు. పది రూపాయలకు బేగం బజారులో దొరికే ప్లాస్టిక్ కత్తికి, రోజుకు ఐదు వందల అద్దె అని చెప్పాడు. నేను ఆ రోజు సాయంత్రం నాకు తెలిసిన ఒక ఉద్యోగితో వంద రూపాయలకి పది కత్తులు తెప్పించాను. లేకపోతే, ఐదు వేలు ఖర్చయ్యేవి. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. ఇటువంటి సంఘటనలు కోకొల్లలు. ఇవన్నింటి మీద అవగాహన రావాలంటే, సినిమా నిర్మాణంలో ఎంతో అనుభవం గడించాలి. నేను మంచి పాటలు రాసాను, అవి హిట్ అయ్యాయి కాబట్టి నేను సినిమా నిర్మిస్తానంటే కుదరదు. నిన్ను వాళ్ళు వారించరు. నిర్మాణం చేసి, నువ్వు నాశనమయ్యేంత వరకు చూస్తారే గానీ ఎవ్వరూ సలహాలివ్వరు. కులశేఖర్ గారు కూడా అటువంటి సంఘర్షణకు, తీవ్రమైన నిరాశకు గురయి, మనో స్థిమితం కోల్పోయి, తర్వాత ఇంకా దిగజారి, చరిత్ర హీనుడై, మరణించాడు. విజేతలను పొగిడే ఈ సమాజం ఓడిన వారిని అక్కున చేర్చుకోదు. నేనున్నానని భుజం, అందించే తోడు కూడా దూరమవుతుంది.

**కులశేఖర్ మరణం, సినిమారంగపు కుటిలనీతికి ఒక తార్కాణం. పిచ్చి ప్రయోగాలు చేసే వారికి ఒక హెచ్చరిక. మనకు మన కుటుంబం ముఖ్యం. వారి క్షేమం ముఖ్యం. ఆ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని ఏ ప్రయోగాలైనా చేయండి..**

– ప్రభాకర్ జైనీ



ఒకసారి అధికారం రుచి చూస్తే?ఆ రుచి మనిషి రక్తం రుచిమరిగిన పులి కంటే ప్రమాద కరమైనది! మహారాష్ట్ర రాజకీయం పులి కంటే ప్రమాదకరంగా ఉంటుంది! దేశ ఆర్థిక రాజధాని, రాష్ట్ర రాజధాని అయిన ముంబై మీద అధికారం చెలాయించిన వాళ్లకి ఆ అధికారం లేకపోతె జీవితం ఉండదు అనేంతగా విరక్తిని కలగచేస్తుంది! ఉద్ధవ్ థాకరే, ఏకనాథ్ షిండే ల పరిస్థితి అలానే ఉంది. ఉమ్మడి శివసేనగా ఉన్నప్పుడు స్వంతంగా మెజారిటీ ఎప్పుడూ రాలేదు. విడిపోయాక ఇక ఎక్కడ వస్తుంది? కానీ అధికారం మాత్రం కావాలి. ఏకనాథ్ షిండే ఆశ చూడండి. ఎన్నికలకి ముందు మోడీజీ, అమిత్ షా లు ఎలా చెప్తే అలా చేస్తాను అని వినయంగా విలేఖరుల ముందు చెప్పాడు! ఎన్నికలు అయిపోయి ఫలితాలు రాగానే స్వరం మారింది.



# ఒకసారి అధికారం రుచిచూస్తే..

షిండే నేరుగా అనకుండా తన అనుచరులతో ఒక మాట అనిపించాడు: లాడ్లి బెహనా యోజన షిండే మానస పుత్రిక. ఆ పథకం విజయవంతంగా అమలు కావడం వల్లనే మహాయుతి కూటమి గెలిచింది! అంటే ఏకనాథ్ షిండే మళ్ళీ ముఖ్యమంత్రి అవ్వాలి అనే సందేశం పరోక్షంగా బీజేపీ అగ్ర నాయకత్వానికి ఇవ్వడం అన్నమాట!

**అతి వినయం ధూర్త లక్షణం!**

షిండే బయటికి మాట్లాడేది ఒకటి, అమిత్ షా దగ్గర వినయంగా మరొకటి మాట్లాడతాడు. రెండు సార్లు ఢిల్లీ వెళ్లి వచ్చారు ఫడ్నవిస్, షిండేలు కానీ ముఖ్యమంత్రి ఎవరు అనే విషయంలో ఒక స్థిరమైన అభిప్రాయానికి రాలేకపోయారు! అమిత్ షా మాటకి విలువ ఇవ్వలేదు షిండే! బయటికి రాలేదు కానీ షిండే రెండు డిమాండ్లని అమిత్ షా ముందు పెట్టినట్లు తెలుస్తున్నది. 1.అయితే నేనే ముఖ్యమంత్రి అవ్వాలి. 2.నేను ముఖ్యమంత్రి కాలేకపోతే నా కొడుకు శ్రీకాంత్ షిండే కి ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలి.

**వాహ్! క్యా బాత్ హై!**

శ్రీకాంత్ షిండే వయసు 37 ఏళ్ళు! ప్రస్తుతం కళ్యాణ్ లోక్ సభ స్థానంకి ప్రతినిధ్యం వహిస్తున్నాడు. 2014 లో లోక్ సభ కి శివసేన తరుపున పోటీ చేసే సమయానికి వైద్య విద్యార్థిగా చివరి సంవత్సరం చదువుతున్నాడు. శ్రీకాంత్ షిండే ఆర్థోపెడిక్ సర్జన్! 37 ఏళ్ళ వైద్యుడు అయిన శ్రీకాంత్ షిండేకి ఉపముఖ్యమంత్రి పదవి ఇవ్వడానికి బీజేపీనే కాదు ఏ పార్టీ కూడా ఒప్పుకోదు! అందుకే ముఖ్యమంత్రి ఎవరు అనే విషయంలో ప్రతిష్టంబన ఏర్పడింది! ఈనెల 3 న ప్రమాణ స్వీకారం అని మళ్ళీ ఈనెల 5 కి వాయిదా పడింది!

**దీని మీద ప్రజలలో ఎలాంటి అభిప్రాయాలు ఏర్పడతాయి?**

సరే! చివరికి ఫడ్నవీస్ ముఖ్యమంత్రి అవడానికి ఒప్పుకున్నా హోమ్, ఆర్థిక శాఖ లు తమకే ఇవ్వాలని పట్టుబడుతున్నాడు షిండే! ఇంత జరిగాక ఫడ్నవిస్ స్వేచ్ఛగా పాలన చేయగలుగుతాడా? ఈ సందేహం ఇలానే కొనసాగవచ్చు! వంశపారంపర్య రాజకీయాలకి బీజేపీ వ్యతిరేకం! కానీ శ్రీకాంత్ షిండేకి మంత్రిపదవి ఇవ్వక తప్పదు!

**వేరే మార్గం లేదా?**

ఒక దారి మూసుకుపోతే ఇంకో దారి తెరుచుకుంటుంది! ఉద్ధవ్ థాకరే శివసేనలో అంతర్మథనం మొదలయ్యింది! బాల్ ఠాక్రె శివసేన అధ్యక్షుడుగా ఉన్న సమయాన్ని గుర్తు చేసుకుంటున్నారు శివసేనలో ఇంకా కొనసాగుతున్న పెద్ద తరం వారు. కాంగ్రెస్, పవార్‌లతో కూడిన మహావికాస్ అఘాడి నుండి బయటికి వచ్చేయమని ఉద్ధవ్ ఠాక్రె మీద ఒత్తిడి పెరుగుతున్నది!

**బాల్ ఠాక్రె శివసేన వైభవం ఎలా ఉండేది?**

పాకిస్తాన్‌తో క్రికెట్ మ్యాచ్ భారత జట్టు ముంబైలో ఆడాలా వద్దా అనేది బాల్ ఠాక్రె నిర్ణయం మీద ఆధారపడి ఉండేది అప్పట్లో!

బీసీసీఐ పెద్దలు బాల్ ఠాక్రె అనుమతి కోసం వేచిచూసే వారు అప్పట్లో! బాల్ ఠాక్రె అనుమతి ఇవ్వకపోయినా ముంబై వాంఖడే స్టేడియంలో క్రికెట్ మ్యాచ్ ఆడడానికి సిద్ధం అయినప్పుడు శివసేన కార్యకర్తలు పిచ్‌ని తవ్వేసిన రోజులు ఉన్నాయి!

మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎవరు ఉన్నా బాల్ ఠాక్రెని కలవాలి తప్పనిసరిగా, అది ప్రమాణస్వీకారం చేసే ముందు అయినా కావొచ్చు లేదా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత అయినా కావొచ్చు కానీ బాల్ ఠాక్రెని కలిసి ఆయన ఆశీస్సులు తీసుకోవడం ఆనాయితీగా ఉండేది!

**వాజపేయి, లాల్ కృష్ణ అద్వాని కూడా బాల్ ఠాక్రెని కలిసేవారు!**

ఇక గోద్రా రైలు దుర్ఘటన తరువాత అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రి అయిన శ్రీ నరేంద్ర మోడీజీ ని భర్తరఫ్ చేయాలని వాజాపేయి గారి మీద తీవ్ర ఒత్తిడి వచ్చిన సమయంలో మోడీజీ ముంబై వచ్చి బాల్ ఠాక్రెని కలిసి పరిస్థితి వివరించాక బాల్ ఠాక్రె అన్న మాటలు ఏమిటంటే.. చర్యకి ప్రతి చర్య ఉంటుంది అని. అసలు అయోధ్య లో కరసేవ చేసి వస్తున్న ప్రయాణీకులని సజీవ దహనం చేసిన వాళ్ళని ప్రశ్నించకుండా తిరగబడిన ప్రజల గురుంచి మాట్లాడే హక్కు ఎవరికీ లేదు! బాల్ ఠాక్రె ఆ రోజు అలా మాట్లాడడం వలన ప్రధాన మీడియా తన జోరు తగ్గించుకుంది! ఎందుకంటే అన్ని మీడియాలకి ముంబై లో ప్రధాన కార్యాలయాలు ఉన్నాయి!

**అలాంటి శివసేన వైభవం ఈ రోజున ఎలా ఉంది?**

కేవలం తనకి ముఖ్యమంత్రి పీఠం మీద ఉన్న ఆశ వల్ల ఉద్ధవ్ ఠాక్రె తీసుకున్న నిర్ణయం ఈ రోజున ఇలా ఉన్నది! సో.. తనమీద ఒస్తున్న ఒత్తిడికి తలవంచి ఉద్ధవ్ ఠాక్రె ఇప్పటికిప్పుడు మహా వికాస్ అఘాడి నుండి బయటికి వచ్చినా మళ్ళీ శివసేనకి పూర్వ వైభవం రావడం కల్ల!

అందుకే ఉద్ధవ్ ఠాక్రె శివసేనకి చెందిన 15 మంది బీజేపీలో చేరడానికి సిద్ధంగా ఉన్నామని సాంకేతాలు ఇస్తున్నారు!

**అజిత్ పవార్ మాటేమిటి?**

నాలుగురోజుల క్రితం శరద్ పవార్‌తో సన్నిహితంగా ఉండే వ్యక్తితో అజిత్ పవార్ రహస్యంగా భేటీ అయిన సంగతి ఇంటెలిజెన్స్ పసిగట్టి విషయాన్ని అమిత్‌షాకి తెలిపారు. అఫ్కోర్స్! ముంబై నుండి వెలువడే కొన్ని టాబ్లాయిడ్స్ కూడా ఈ విషయం మీద ఊహగానాలు చేస్తూ కథనాలు వండి వార్చాయి!

ఉద్ధవ్ ఠాక్రెకి ఆదిత్య ఠాక్రె.. ఏకనాథ్ షిండే కి శ్రీకాంత్ షిండే! సన్ స్ట్రోక్ తప్పదు! ప్రస్తుతానికి మహారాష్ట్రలో రాజకీయ సంక్షోభం అంటూ ఏమీ లేకపోయినా భవిష్యత్ లో ఉండబోదు అనే గ్యారంటీ లేదు. అయితే అమిత్ షా గారి దగ్గర భవిష్యత్ ప్రణాళికలు ఉన్నాయి!

కాబోయే ముఖ్యమంత్రి శ్రీ దేవేంద్ర ఫడ్నవిస్ గారికి ముందస్తు శుభాకాంక్షలు!

- పొట్లూరి పార్థసారథి

## నేహాకు సీపీరావు మెమోరియల్ అవార్డు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

గతనెల 30న హైదరాబాద్ శిల్ప కళావేదికలో జరిగిన నాట్య తోరణం కార్యక్రమంలో బహు ప్రదర్శనలు జరగగా, యువ కళాకారులను గుర్తు చేస్తూ అమృత కల్చరల్‌ట్రస్ట్ వారు సమర్పణలో ప్రతిష్టాత్మకడా సీపీరావు రావు మెమోరియల్ అవార్డులను బహుకరించగా నగరానికి చెందిన డి.నేహాకు కూచిపూడిలో ఈ బహుకారాన్ని అందించారు. బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ శ్రీకాంత్ రఘుపాత్రుని శిష్యురాలు అయిన నేహాకు ఐసీహెచ్ క్రియేటివ్ సొల్యూషన్స్ కో-ఫౌండర్ అనురాధ చంద్రశేఖర్, భార్గవి పగడాల, సీతా ఆనంద్, రేవతి భూపాల తదితరుల చేతుల మీదుగా జ్ఞాపికను, ధృవపత్రాన్ని, నగదు పురస్కారాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో శైలజా రామయ్యర్, తోట చంద్రశేఖర్, పీవీ రావు, టీవీ నరసింహరావు, జి పద్మజరెడ్డి, నటి కోటి సూర్యప్రభ తదితరులు పాల్గొన్నారు.



## ఉద్యోగభద్రత కల్పించాలి

(సత్యంన్యూస్, సీతంపేట)

గత 20 సంవత్సరాలుగా పని చేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆదివాసీ పరిషత్ అధ్యక్షులు వాబయోగి డిమాండ్ చేశారు. గత 13 రోజులుగా సీతంపేట ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఉద్యోగులకు సోమవారం ఆయన సంఘీభావం తెలిపారు. అనంతరం మాట్లాడుతూ గిరిజన గురుకులాల్లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగస్తులకు తగిన ఉద్యోగ భద్రత కల్పించాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందన్నారు. వీళ్లు చేస్తున్న పోస్టులు డిఎస్సీలో కలిపినట్లయితే వారి జీవితాలు బుగ్గిపాలవుతాయన్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత నిరుద్యోగ యువతకు భద్రత లేకుండా పోయిందని విమర్శించారు. ప్రభుత్వం కూడా ఆలోచన చేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగస్తులకు అండగా ఉంటుందని అన్నారు. వారి న్యాయం చేసే వరకు వారు కూడా ఉద్యమాలను పాల్గొంటామన్నారు.




## విశ్రాంత ఫోటోగ్రాఫర్‌కు ఆర్థిక సాయం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అనారోగ్యంతో బాధపడుతున్న విశ్రాంత ఫోటోగ్రాఫర్ అవనాపు శ్రీనివాసరావుకు శ్రీకాకుళం పట్టణ నాగవంశ సంక్షేమ సంఘం పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించింది. స్థానికంగా ఉండే ఒక ప్రముఖ ఫోటో స్టూడియోలో పనిచేసి, కొన్ని పత్రికలకు ఫ్రీ లాన్స్ ఫోటోగ్రాఫర్‌గా కూడా పనిచేసిన శ్రీనివాసరావు సోమవారం ఉదయం అందజేశారు. గడచిన కొన్ని నెలల నుంచి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆర్థిక ఇబ్బందులు కూడా ఉన్న, ఆయనకు మెరుగైన వైద్యం కోసం సహకారం లేని పరిస్థితులను తెలుసుకొని, పదివేల రూపాయలను అందజేయాలని నాగవంశ సంక్షేమ సంఘం నిర్ణయించింది. మానవత్వంతో సంస్థలు, వ్యక్తులు అతని కుటుంబానికి సహాయం చేయాలని ఐజేయు జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లి ధర్మారావు కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్ష కార్యదర్శులు మొఖర వెంకట మల్లేశ్వరరావు ముని శ్రీనివాసరావు పొడుగు శ్యామ్ సుందర్ నల్ల అప్పలనాయుడు ఆర్గనైజేషన్ సెక్రటరీ బోణ రాజేశ్వరరావు కోశాధికారి కొన్ని సూరిప్రకాష్, కార్యవర్గ సభ్యుడు ముని ఎర్రయ్య తదితరులు ఉన్నారు.



## ఘనంగా కంప్యూటర్ అక్షరాస్యత దినోత్సవం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరంలోని ఎల్ఐసి కార్యాలయం ప్రక్కన ఉన్న కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ అక్షరాస్యత దినోత్సవంను ఘనంగా నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన 10జీ మైండ్స్ మేనేజింగ్ డైరెక్టర్ పై త్రినాధరావు మాట్లాడుతూ నేటి ఆధునిక ప్రపంచంలో కంప్యూటర్ అనేది ముఖ్య పాత్ర పోషిస్తుందని కాబట్టి ప్రతి ఒక్కరు కూడా కంప్యూటర్ పరిజ్ఞానం అవసరమన్నారు మారుతున్న కాలంతో పాటు కంప్యూటర్లలో అనేకమైన కొత్త కోర్సులు వస్తున్నాయి కాబట్టి యువత వాటిమీద కూడా దృష్టి సారించాలన్నారు. కళాశాల డైరెక్టర్ బి.ఎస్.చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివశంకర్ మాట్లాడుతూ భారతదేశం నుండి వెళ్లిన సత్య నాదెళ్ల, సుందర్ పిచ్చాయి వంటి వారు ఈ కంప్యూటర్ రంగాలలో తమదైన ముద్ర వేసి దేశానికీ గర్వ కారణంగా ఉన్నారన్నారు. కాబట్టి యువత వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కాబట్టి మన ఆదిత్య విద్యాసంస్థలు కూడా మారుతున్నా టెక్నాలజీతో పాటు వివిధ కంపెనీలతో ఒప్పందాలు చేసుకొని కొత్త కంప్యూటర్ కోర్సులను అందిస్తున్నాయి కాబట్టి వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.వేణు, కంప్యూటర్ విభాగాధిపతి ఎల్.ప్రసాదరావు, కంప్యూటర్ విభాగ అధ్యాపకులు,విద్యార్థినిలు పాల్గొన్నారు.

## ఘనంగా తెరవే సాహితీ సమ్మేళనం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)


తెలుగు రచయితల వేదిక ఆధ్వర్యంలో 99వ నెల నెలవారీ సాహితీ సమ్మేళనం స్థానిక శాంతినికేతన్ కళాశాలలో సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, రఘుపాత్రుని వెంకట రమణ మూర్తి గార్ల నిర్వహణలో ఘనంగా నిర్వహించారు. తొలుత సంస్థ సభ్యులు, ఇటీవల స్వర్గస్తురాలయిన రచయిత్రి శ్రీమతి అయ్యగారి సుమిత్రమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. అనంతరం అధ్యక్షులు నాగేశ్వరరావు మాట్లాడుతూ కవుల రచనలు చిరస్థాయిగా నిలిచిపోయేలా గ్రంథస్తం చేయాలని కోరారు. రాబోవు 100వ నెల నెలవారీ సాహితీ సమ్మేళనం కార్యక్రమంలో తెరవే కవుల రచనలతో వెలువడు కవితాసంపుటి పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్లు సంస్థ ప్రధాన కార్యదర్శి రమణమూర్తి తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జంధ్యాల శరత్‌బాబు మాట్లాడుతూ ఒక సాహితీ సంస్థ నిర్విఘ్నంగా శతమాస కవి సమ్మేళనములు నిర్వహించటం గొప్పవిషయమని, తెరవే సంస్థ ద్వారా మున్ముందు మంచి రచనలు రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో 15మంది కవులు పాల్గొని తమ రచనలను వినిపించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, డా.కోమలరావు, ఇద్ది పాపయ్య, నిక్కు హరిసత్యన్నారాయణ, ఐ.యన్.డి.ప్రసాద్, కిల్లాన శ్రీనివాస్, యు.నాగేశ్వరరావు, వి.రాజారావు, ముట్నూరు ఉపేంద్ర శర్మ, భోగెల ఉమామహేశ్వరరావు, ఆర్.వి.రమణమూర్తి, పూడి జనార్దన్, జె.శరత్‌బాబు, కుప్పిలి త్రినాథరావు, సోడ వరం ఈశ్వరరావు, బాలాజీ రవికిరణ్, పాల్గొన్నారు



## సాంస్కృతిక వైభవం.. కృష్ణవేణి సంగీత నీరాజనం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అరసవల్లి శ్రీ సూర్యనారాయణ దేవస్థానంలో ఆదివారం కృష్ణవేణి సంగీత నీరాజనం కార్యక్రమం సాంస్కృతిక వైభవంతో సాగింది. కేంద్ర పర్యాటక సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్, నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కలిసి సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన దేశ సాంస్కృతిక వారసత్వాన్ని ఈ సంగీత కార్యక్రమం ప్రతిబింబిస్తుందని, ఈ సంగీత విందును ఆస్వాదించడం ఎంతో సంతోషాన్నిచ్చిందన్నారు. కార్యక్రమంలో ప్రఖ్యాత కళాకారులు విదుషి మండ సుధారాణి బృందం గాత్రకచేరి (కర్ణాటక శాస్త్రీయ సంగీతం), వయోలిన్-డాక్టర్ మావుడూరు సత్య నారాయణ శర్మ, మృదంగం ఎం శ్రీధర్, ఘటం-మావుడూరు సూర్య ప్రసాద్ రావు తదితరులు అద్భుతమైన ప్రదర్శన ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని పర్యాటక మంత్రిత్వ శాఖ, సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ సంయుక్తంగా నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో కేంద్ర పర్యాటక సాంస్కృతిక శాఖ తరపున చందర్ నాయక్ మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, ఆర్డీవో సాయిప్రత్యూష, అరసవల్లి దేవస్థానము డిప్యూటీ కమిషనర్ వై భద్రాజి, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర్ శర్మ, జిల్లా పర్యాటక అధికారి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.


















# వలపు వల.. అటవీశాఖకు మరో మరక

(మొదటిపేజీ తరువాయి)

పరిస్థితి బాగులేక పరారయ్యానంటూ ఓ సర్టిఫికెట్ తీసుకొస్తే, ఆగమేఘాల మీద వేణు ఫైల్‌ను కదిపి వెంటనే పోస్టింగ్ ఇచ్చేశారు. అక్కడితో ఆగకుండా ఈ మూడేళ్లు ఆయనకు రావాల్సిన అన్ని బెనిఫిట్లను పుచ్చపువ్వుల మాదిరిగా చేతిలో పెట్టారు. మూడేళ్ల పాటు జాయ్ జమీమాతో హానీట్రాప్ ముఠాలో కీలకంగా వ్యవహరించిన వేణుభాస్కర్‌రెడ్డి ఆ సొమ్మును అటవీ అధికారుల మొహాన కొట్టి ఎంచక్కా ఎటువంటి గొడవా లేకుండా విధుల్లో చేరిపోయారు. ఒక చిన్న ఆటోలో రెండు దుంగలు దొరికితే ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువుల నీరు తాగించే అటవీశాఖ అధికారులు మూడేళ్లపాటు కనిపించకుండాపోయి మానసిక పరిస్థితి బాగులేదని తెచ్చిన ఓ సర్టిఫికెట్‌ను మెడికల్ బోర్డుకు రిఫర్ చేయకుండా ఉద్యోగం, బెనిఫిట్స్ ఇచ్చేయడంపై ఇప్పుడు అటవీశాఖలో పెద్ద చర్చ సాగుతుంది. శ్రీకాకుళం డివిజన్‌లో డీఎఫ్‌వోగా కేవలం మూడు నెలలు మాత్రమే పని చేసిన జి.జి.నరేంద్రన్ కాలంలో జూనియర్ అసిస్టెంట్ కమ్ ఫారెస్టర్ అయిన ఉర్నాన వాసుదేవరావు, మరో జూనియర్ అసిస్టెంట్ కొర్ను చక్రధరరావు, ప్రస్తుతం అకౌంట్స్ విభాగం సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న ఎ.చంద్రశేఖరరాజు వేణుభాస్కర్‌రెడ్డి హనీట్రాప్‌లో సంపాదించిన సొమ్ములో కొంత మొత్తం ముట్టజెపితే ఆగమేఘాల మీద మళ్లీ రీపోస్టింగ్ ఇచ్చేశారు. అప్పుడు ఈ ఫైల్ మీద సంతకం పెట్టాల్సిన జనరల్ సూపరింటెండెంట్ వి.సత్యనారాయణ నోట్‌ఫైల్ మీద సంతకం చేయనంటే చంద్రశేఖరరాజు ఆ ఛార్జి తీసుకొని వేణుభాస్కర్‌రెడ్డికి పోస్టింగ్ ఇప్పించారు. జాయ్ జమీమా వలపు వల విసరడం ద్వారా వచ్చిన సొమ్మును వేణుభాస్కర్‌రెడ్డి శ్రీకాకుళంలో 2022లో ఉద్యోగంలో చేరిన దగ్గర నుంచి వడ్డీలకు తిప్పుతున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. కొద్ది రోజుల క్రితం విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన అధికారులు వేణుభాస్కర్‌రెడ్డి కోసం గాలిస్తూ శ్రీకాకుళం వచ్చారు. విశాఖలో కేసు నమోదైందని తెలుసుకున్న వేణుభాస్కర్‌రెడ్డి మళ్లీ పరారీ కావడంతో ఇదే అటవీశాఖ ముఠా ఆయనకు చిన్న ప్రమాదం జరిగిందని, నడవలేకపోతుండటం వల్ల సెలవు పెట్టాడని సమర్థించుకుంటూ వస్తోంది.

### వేణు పాపం పండిందిలా..

హైదరాబాద్‌కు చెందిన మహమ్మద్ అజీమ్‌ఖాన్ కొద్ది రోజుల క్రితం ఎయిర్‌పోర్టు పోలీసులకు జాయ్ జమీమా మీద ఫిర్యాదు చేశారు. 2022లో తాను మురళీనగర్ పాస్‌పోర్టు ఆఫీసు బిల్డింగ్ ఎదురుగా ఉన్న బొత్స స్క్వేర్‌లో రతన్‌రాజుకు చెందిన ఆర్‌ఆర్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ప్రాజెక్ట్ గేమ్ డెవలపర్‌గా పని చేశానని, అదే ఏడాది జనవరిలో రతన్‌రాజు జాయ్‌జమీమాను ఆయన కుటుంబ స్నేహితురాలిగా పరిచయం చేసి ప్రాజెక్ట్ హెడ్‌గా నియమించారని, అప్పట్నుంచే తనను హానీట్రాప్‌లో దించే ప్రయత్నాలు మొదలయ్యాయని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆమెకు సాంకేతిక పరిజ్ఞానం లేనందున తాను పని చేయడానికి వెనుకాడానని, దీంతో తాను చేస్తున్న గేమింగ్ ప్రాజెక్టు వృథా అని రతన్‌రాజుకు చెప్పడంతో ఆయన ప్రాజెక్ట్ నిలిపేయాలని భావించినట్లు ఎయిర్‌పోర్టు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అప్పట్నుంచి ఆఫీసుకు రెగ్యులర్‌గా రావడం, టెక్నికల్‌గా పెద్ద బ్యాక్‌గ్రౌండ్ ఉన్నట్టు నటించడం మొదలుపెట్టిందని, అక్కడికి కొద్ది రోజుల్లోనే కెగుష్ అనే యాప్‌ను తయారుచేస్తున్నానని, ఇది ఇన్‌స్టాగ్రామ్‌కు పోటీ ఇస్తుందని చెప్పి పగలు పనిచేసే కార్యాలయాన్ని రాత్రి షిఫ్ట్‌కు మార్చిందని, అప్పట్నుంచి తనతో పాటు డిన్నర్ చేయడంతో మొదలుపెట్టి తనను ఆశాంతం ముంచేసిందంటూ మహమ్మద్ అజీమ్‌ఖాన్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే ఈ అంశానికి, వేణురెడ్డికి సంబంధమేమిటంటే.. తాను హైదరాబాద్ వెళ్లిపోతానని చెప్పినప్పుడు జాయ్ జమీమాతో ఉన్న సన్నిహిత ఫొటోలు, వీడియోలను చూపించి ప్రతీరాత్రి ఆమెతో సెక్స్ చేసినట్లు అందరికీ వీటిని షేర్ చేస్తానని బ్లాక్‌మెయిల్ చేసిందని, తనతో సంబంధం కారణంగా గర్భవతినయ్యానని భయపెట్టడంతో ఆమెను వేడుకోవడంతో తన మామ వేణురెడ్డి ఉరఫ్ చిన్నాకు కూడా తెలుసు కాబట్టి, ఆయన నోరెత్తకుండా ఉండటానికి రూ.5 లక్షలు ఇవ్వాలని చెబితే, ఆయన ఖాతాలో ఆ మొత్తాన్ని తన మిత్రుడి ద్వారా వేయించానని బాధితుడు పేర్కొన్నాడు. మురళీనగర్‌లో ఒక ఇంటిని తీసుకొని, దానికి ఫర్నిచర్, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఐ-ఫోన్ అన్నీ తనతో కొనిపించి, తామిద్దరం భార్యాభర్తలమంటూ ఆ ఇంటిలో ఫొటోలు అలంకరించిందని, దీంతో తనను విడిచిపెట్టి ఈ కథకు ముగింపు పలకాలని కోరుకుంటే వీడియోకాల్ చేసి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించి, ఆ లేఖలో తన పేరు రాస్తానని భయపెట్టడం వల్ల ఎవరికీ చెప్పుకోలేకపోయానని బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మానసిక క్షోభ భరించలేక హైదరాబాద్ వెళ్లిపోతే అక్కడ బేగంపేటలో అద్దె ఇల్లు తీసుకుని ఉంచాల్సి వచ్చిందని, తన స్నేహితుడి పేరు మీద ద్విచక్ర వాహనాన్ని కూడా కొని ఆమెకు ఇచ్చిన కొంతకాలం తర్వాత విశాఖపట్నం మకాం మార్చిందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. తన తల్లిదండ్రులు, అత్తమామల ఇంటికి వస్తానని, పిల్లలకు ఫొటోలు, వీడియోలు చూపిస్తానని బెదిరించి తన డబ్బు మొత్తం లాక్కుందని, హైదరాబాద్‌లోనే రూ.10 లక్షలు ఇచ్చానని బాధితుడు పోలీసుల ముందు మొర పెట్టుకున్నాడు. చివరకు భరించలేక ఎదురుతిరిగితే తనకు తానే గాయపర్చుకొని పెద్దగా అరవడం వంటి పనులు చేయడంతో బేగంపేటలో ఇంటి యజమాని ఖాళీ చేయమనడంతో మళ్లీ విశాఖపట్నానికి మకాం మార్చామని, ఈ సమయంలో బేగంపేటలో ఉన్న ఫర్నిచర్, ఎలక్ట్రానిక్ వస్తువులన్నీ వేణుభాస్కర్‌రెడ్డే తీసుకున్నారని ఆయన ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. లక్షలకు లక్షలు ఇద్దరూ వసూలుచేసిన తర్వా చివరిగా రూ.3 కోట్లు ఇస్తే వదిలేస్తానని చెప్పిందని మహమ్మద్ అజీమ్‌ఖాన్ మొరపెట్టుకున్నారు. ఈ డబ్బు కోసం తనను ఏడు రోజుల పాటు బంధించిందని, ఒక సమయంలో కత్తితో దాడి చేయడానికి ప్రయత్నించడంతో షేర్‌ఆటో ఎక్కి పరారైపోయానని, గోపాలపట్నం వద్ద వేణురెడ్డి, జాయ్ జమీమా తన కారులో ప్రవేశించి ఒక నిర్జన ప్రదేశానికి తీసుకువెళ్లి తన ఒంటిపై ఉన్న బంగారాన్ని తీసుకుపోయారని, జమీమా కత్తి తీసి చంపడానికి ప్రయత్నించిందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఇంత చేసినా తాను పోలీసులకు చెప్పలేదని, తిరిగి వారే తనపై గోపాలపట్నంలో మిస్సింగ్ కేసు, ఎయిర్‌పోర్టు స్టేషన్‌లో లైంగిక వేధింపుల ఫిర్యాదు చేసినట్లు తెలిసి పోలీసుల ముందుకు వచ్చానని బాధితుడు పోలీసులకు తెలిపాడు. దాదాపు కోటి రూపాయలు జాయ్ జమీమా, వేణుభాస్కర్‌రెడ్డి కలిసి దోచుకున్నట్టు ఫిర్యాదు చేశారు. దీనిపైనే వేణుభాస్కర్ రెడ్డిని ఎయిర్‌పోర్టు పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. 2019లో హనీట్రాప్ ద్వారా సొమ్ములు సంపాదించ దానికే వేణుభాస్కర్‌రెడ్డి పరారయ్యారు. 2022లో ఎప్పుడైతే మహమ్మద్ అజీమ్‌ఖాన్ ఎపిసోడ్ బయట పడిందో మళ్లీ ఏమీ ఎరగనట్టు వేణు విధుల్లో చేరిపోయారు. ఈ పాపంలో పాలుపంచుకున్న ఫారెస్ట్ సిబ్బందికి హనీట్రాప్ డబ్బులే అందాయి.

# జీసీటీఏ నూతన కార్యవర్గం ఎన్నిక



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం (జీసీటీఏ) అధ్యక్షులుగా పాతపట్నం డిగ్రీ కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ కె.చక్రపతి వరుసగా మూడో పర్యాయం ఎన్నికయ్యారు. అలాగే జిల్లా కార్యదర్శిగా ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల రసాయన శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ ఎస్.రామకృష్ణ, మహిళా కార్యదర్శిగా ప్రభుత్వ మహిళా కళాశాల భౌతిక శాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ టి.స్వర్ణలత, కోశాధికారిగా టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల రసాయన శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ బి.సతీష్ ఎన్నికైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, రాష్ట్ర లీగల్ కమిటీ చైర్మన్ డాక్టర్ ఆర్.ఉమామహేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. పరిశీలకులుగా పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి బి.శ్రీనివాసరావు, ప్రస్తుత జిల్లా కార్యదర్శి డాక్టర్ ఎస్.ఢిల్లీశ్వరరావు ఆధ్వర్యంలో ప్రభుత్వ మహిళా కళాశాల శ్రీకాకుళం వేదికగా జిల్లాస్థాయి సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గం ఎన్నికలు నిర్వహించారు. మహిళా కార్యదర్శి, కోశాధికారి ఎన్నిక ఏకగ్రీవంగా జరిగినట్లు తెలిపారు. నూతన కార్యవర్గాన్ని మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, జోనల్ ప్రెసిడెంట్ డాక్టర్ డి.పైడితల్లి, మహిళా కార్యదర్శి టి.ఆదిలక్ష్మి, పూర్వపు కార్యదర్శి డాక్టర్ వై.పోలినాయుడు, రాష్ట్ర ఆఫీస్ సెక్రటరీ ల్యుక్సాల్, అధ్యాపకులు శుభాకాంక్షలు తెలియజేశారు.

# వర్మీ కంపోస్టు విక్రయాన్ని ప్రోత్సహించాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



వర్మీ కంపోస్టు విక్రయాన్ని ప్రోత్సహించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరం బయట ఏర్పాటుచేసిన వర్మీ కంపోస్టు స్టాల్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్మీ కంపోస్టు పంచాయతీల నుంచి స్వయం సహాయక సంఘాలకు సరఫరా చేస్తే వారు విక్రయిస్తారని చెప్పారు. దూసి పంచాయతీ నుంచి వర్మీ కంపోస్టు స్టాల్‌ను ఏర్పాటు చేశారు. పంచాయతీలకు క్యూ ఆర్ కోడ్ ఉండాలని, దాని ద్వారా వర్మీ కంపోస్టు పేమెంట్ తీసుకోవాలని డిపిఓను ఆదేశించారు. వర్మీ కంపోస్టు అందరూ కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించాలన్నారు. మున్సిపాలిటీల నుంచి వర్మీ కంపోస్టు స్టాల్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఆర్గానిక్ పంటలు పండించే రైతుల ఫోన్ నంబర్లు తీసుకొని వారికి ఫోన్ చేసి వర్మీ కంపోస్టు విక్రయంపై రైతులకు తెలియజేయాలని ఆదేశించారు. ఆర్గానిక్ పంటలు పండించే రైతుల ఫోన్ నంబర్లు మార్కెటింగ్ శాఖ ఏడీ వద్ద ఉంటాయని చెప్పారు. వర్మీ కంపోస్టు రైతులకు ఉపయోగకరంగా ఉండాలన్నారు. ఉద్యానవన శాఖ, ఉపాధి హామీ నుంచి వర్మీ కంపోస్టు ఉపయోగాలపై రైతులకు తెలియజేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీపీవో కె.భారతి సౌజన్య, ఎంపీడీవో నిశ్చల, దూసి పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## సొండి సామాజికవర్గానికి ప్రత్యేక కార్పొరేషన్

**- టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు -**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సొండికుల సామాజికవర్గాన్ని ప్రత్యేక కార్పొరేషన్‌తో పాటు, ఓబీసీలో చేర్పించే విధంగా తనవంతు కృషి చేస్తానని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. సొండి కుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నెమలిపురి కోటేశ్వర చౌదరి ఆధ్వర్యంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులును ఆ సామాజికవర్గ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం దుశ్శాలువతో సత్కరించి అరసవల్లి సూర్యనారాయణ స్వామి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా వారు వినతి పత్రం అందజేస్తూ సొండి సామాజిక వర్గాన్ని ప్రత్యేక కార్పొరేషన్ చేయాలని, ఓబీసీలో చేర్పించాలని కోరారు. దీనిపై పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న సొండి సామాజిక వర్గానికి చెందినవారందరు ఒక తాటిపైకి వచ్చి సమగ్ర సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు సొండి కుల సామాజిక వర్గాన్ని ప్రత్యేక కార్పొరేషన్ చేయడానికి లేఖ రాసి పంపుతామన్నారు. ఈ సందర్భంగా ఎన్నో ఏళ్లుగా సమాజంలో అణగారిన వర్గాల్లో ఉన్న సొండి సామాజిక వర్గానికి సముచిత గుర్తింపు, గౌరవాన్ని కూటమి ప్రభుత్వం ఇస్తుందని ఆయన హామీ ఇచ్చారు.



## గార ఎస్‌బీఐ వద్ద ఖాతాదారుల ఆందోళన



(సత్యంన్యూస్, గార)

గార ఎస్‌బీఐలో తాకట్టులో ఉన్న బంగారు నగలు మాయమైన తర్వాత పోలీసులు రికవరీ చేసినా, ఇంతవరకు తమ ఆభరణాలు అప్పగించడంలేదంటూ ఖాతాదారులు బ్రాంచి వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. 2023 నవంబరులో లాకర్‌లో ఉండాల్సిన బంగారు నగలు మాయమయ్యాయని, వీటిని ప్రైవేటు బ్యాంకుల్లో పద్దుపెట్టి సొమ్ములు తీసుకున్నారంటూ పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం ప్రైవేటు బ్యాంకుల్లో ఉన్న బంగారాన్ని తెచ్చి మళ్లీ బ్యాంకులో బ్యాంకులో జమ చేశారు. అప్పట్నుంచి తమ బంగారం విడిపించుకుంటామంటూ ఖాతాదారులు బ్యాంకు చుట్టూ తిరుగుతున్నారు. ప్రతీసారి అక్కడి సిబ్బంది ఏదో ఒక కథ చెప్పి తప్పించుకోవడంతో కొద్ది రోజుల క్రితం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ డిసెంబరు 2న నగలు విడిపించుకోవచ్చని హామీ ఇచ్చారు. ఆమేరకు శనివారం బ్యాంకుకు చేరుకున్న ఖాతాదారులకు సిబ్బంది అప్పుడే కుదరదని చెప్పడంతో ఆందోళనకు దిగారు. వాస్తవానికి పోలీసులు రికవరీ చేసి తెచ్చిన తర్వాత దాన్ని విడిపించుకునే ఖాతాదారులకు ఇవ్వడానికి వెసులుబాటు కల్పించాలంటూ కోర్టుకు బ్యాంకు తరఫున అఫిడవిట్ సమర్పించాలి. ఆ విషయంలో బ్యాంకు అధికారులు జాప్యం చేశారు. ఆతర్వాత అఫిడవిట్ ఇచ్చినా మెజిస్ట్రేట్ లేకపోవడంతో ఇది వాయిదా పడుతూ వచ్చింది. బంగారం తమ చేతికి రాలేదన్న ఆందోళనలో ఖాతాదారులుంటే, వడ్డీ కట్టాలంటూ నోటీసులు పంపడంతో బ్యాంకు మీద ఖాతాదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# అన్నదాత 'వెన్ను' వంగింది!

(సత్యంన్యూస్, నరసన్నపేట)

ఫెయింజల్ తుపాను ప్రభావం జిల్లాలో పెద్దగా లేకపోయినా అడపా దడపా కురిసిన ఆ చిన్నపాటి వర్షం జిల్లాలో అన్నదాత వెన్ను వంచేసింది. గడిచిన కొన్నేళ్లుగా ఖరీఫ్ సీజన్‌లో అకాల వర్షాల వల్ల అన్నదాత నష్టపోతున్నాడు. ఫెయింజల్ తుపాను ఉందని వారం రోజుల ముందు వాతావరణ శాఖ హెచ్చరించినా, ఆ సమయానికి ఎండలు కాయడం వల్ల, తుపాను చెన్నై దాటాక తీరం దాటుతుందని ప్రకటించడం వల్ల జిల్లాలో రైతులు ధీమాపడిపోయారు. కానీ కల్లాల్లో ఉన్న ధాన్యం కుప్పలు, పొలాల్లో ఉన్న వరి కంకులు వర్షానికి పూర్తిగా నానిపోయాయి. పొలాల్లో ఉన్నవి కోతకు పనికిరాకుండాపోయాయి. సోమవారం కూడా ఎండ లేకపోవడంతో మంగళవారానికి ఇవి మొలకెత్తుతాయని రైతులు చెబుతున్నాయి. కల్లాల్లో ఉన్న ధాన్యం, ఆరేసిన ధాన్యం తడిసిపోకుండా టార్పాలిన్లు పరిచినా కొంతభాగం నానిపోయింది. శుక్రవారం నుంచి జిల్లాలో టార్పాలిన్లకు విపరీతమైన గిరాకీ ఏర్పడింది. ఎన్ని చేసినా రైతు నష్టాన్ని మాత్రం నివారించలేకపోయారు. సోమవారం ఉదయం కూడా వర్షం కురవడంతో రైతులు పూర్తిగా ఆశ వదిలేశారు. ఇప్పుడిప్పుడే లెవీ ప్రారంభమైంది. 80 కేజీల బస్తాకు 84కిలోల ధాన్యం తీసుకుంటున్న మిల్లర్లు ఇప్పుడు వర్షానికి తడిచిన పంట కొనుగోలు చేస్తారా, లేదా అన్నది ఇంకా తేలలేదు. వర్షానికి తడవని ధాన్యం ఉన్నా, అందులో తేమశాతం పెరిగిపోయిందని మరెన్ని అదనంగా తీసుకుంటారోనని రైతులు భయపడుతున్నారు. పొలాల్లో కొయ్యకుండా ఉన్న పంట వెన్ను పూర్తిగా వంగిపోయింది. తుపాను ప్రభావంతో రైతులు నష్టపోకుండా జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తం చేసింది. రెండు రోజుల వరకు కోతలు కోయవద్దని అధికారులు రైతులకు సూచించారు. కానీ ఆ తర్వాత వర్షం పడటంతో రైతులు నష్టపోయారు. ఆరబెట్టిన ధాన్యాన్ని తేమశాతం 19 వరకు ఉన్నా బస్తాల్లో నింపి మిల్లులకు తరలించే చర్యలను చేపట్టారు. తుపాను ప్రభావంతో వీస్తున్న ఈదురుగాలులకు వరి పొలాలు నేలకొరిగాయి. పొలాల్లో వర్షపునీరు చేరడంతో వర్షాలు తగ్గుముఖం పట్టినా వారం రోజుల వరకు పంటపొలాలు ఆరితే తప్ప కోసే పరిస్థితి లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. యంత్రాలతో కోసిన ధాన్యం ఆరబోసేందుకు కల్లాలు కూడా ఆరాల్సిన పరిస్థితి తలెత్తిందని రైతులంటున్నారు. ఇప్పటికే రెల్లరాల్చు, కత్తెరపురుగు సోకి దిగుబడి తగ్గిపోయిన రైతుపై ఇప్పుడు ఫెయింజల్ తీరని వ్యథను మిగిల్చింది.



పాడైన పంటను చూపుతున్న నరసన్నపేట మండల తెలుగుదేశం నాయకులు పూతి నరసయ్య

## సేవకులకు ప్రశంసా పత్రాలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రపంచ ఎయిడ్స్ దినం ఆదివారం అంబేద్కర్ ఆడిటోరియంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన కలెక్టర్, జేసీ, ఎస్పీ, న్యాయ సేవాసంస్థ జడ్జి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, జిల్లా ఆసుపత్రుల సామాన్య (డీసీహెచ్‌ఎస్) అధికారి, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ నోడల్ అధికారి (డీఎల్‌ఏటీవో) డాక్టర్ శ్రీకాంత్, శ్రీకాకుళం-పార్వతీపురం మన్యం జిల్లాల క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ గంటల ఆదిలింగం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు ఇచ్చి శాలువాతో సన్మానించారు. ఎయిడ్స్ ప్రభావిత బాలలకు పౌష్టికాహారం స్వచ్ఛంద సంస్థలు ఎన్జీవోల సహకారంతో అందజేశారు.



## ట్రెజరీ గార్డు అనుమానాస్పద మృతి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం క్రైమ్)



జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉన్న ట్రెజరీ విభాగంలోని చెస్ట్‌కు గార్డుగా పని చేస్తున్న కానిస్టేబుల్ సవర జోక్యో (55) సోమవారం మృతిచెందారు. విధి నిర్వహణలో భాగంగా మృతిచెందడంతో వన్‌టౌన్ ఎస్‌ఐ హరికృష్ణ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. ఎచ్చెర్ల ఏఆర్ విభాగానికి చెందిన హెడ్‌కానిస్టేబుల్ సవర జోక్యోకు గుండెనొప్పి రావడం వల్లే మరణించాడని భావిస్తున్నా విధి నిర్వహణలో, అదీ ఖజానాకు గార్డుగా ఉన్న సమయంలో ఆకస్మికంగా మృతిచెందడం వెనుక మరేదైనా కోణం ఉందేమోనని వన్‌టౌన్ పోలీసులు అనుమానాస్పదమంటూ కేసు రాసుకున్నారు.

## సరైన వైద్యసేవలు సకాలంలో అందించాలి

(సత్యంన్యూస్, నరసన్నపేట)



నరసన్నపేట ఏరియా హాస్పిటల్ అభివృద్ధికి అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే బగ్గ రమణమూర్తి తెలిపారు. సోమవారం స్థానిక ఏరియా హాస్పిటల్‌లో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మొదటి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోనే ఎంతో పేరు గాంచిన నరసన్నపేట హాస్పిటల్ నేడు పరిస్థితి తగ్గిందని, పూర్వ వైభవాన్ని తీసుకుని రావాలని వైద్యులకు స్పష్టం చేశారు. కార్యక్రమంలో నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. ఇదే ఆసుపత్రిలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించిన విశ్రాంత వైద్యురాలు డాక్టర్ ఎం.పద్మావతిని అభివృద్ధి కమిటీలో చేర్చినట్టు తెలిపారు. ఆమెకు ఆసుపత్రిపై సరైన అవగాహన ఉందని, ఆసుపత్రిని అభివృద్ధి పథంలో నడిపిస్తారన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. వైద్యులందరూ తప్పనిసరిగా చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులతో పాటు వైద్యాధికారులు పాల్గొన్నారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.